# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 285 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం, 23 సెప్టెంబర్ 2026 | పేజీ : 4




ఎంజీఎం దుస్థితిపై ప్రశ్నిస్తే

## దాడులు చేస్తారా?

- వినయ్ భాస్కర్‌పై పోలీసుల దౌర్జన్యంపై పల్లా ఆగ్రహం
- పోలీసుల దాడిని తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే పల్లా

3



అన్నం మెతుకే

## అడ్డు తిరిగిందా?

- అమ్మానాన్నల ఆశలు ఆవిరి.. బాలుడి మృతి
- నిన్నటి వరకు నవ్వులు.. నేడు కన్నీళ్లే
- తోటి విద్యార్థులు, ఉపాధ్యాయుల కంటతడి

3 లో



జీడికల్ బ్రహ్మోత్సవాలకు

## విస్తృత ఏర్పాట్లు చేయాలి

**– ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ / లింగాల ఘణపురం, మన చౌరాస్తా** : లింగాల ఘనపూర్ మండలం జీడికల్ గ్రామంలోని చారిత్రక శ్రీ రామచంద్ర స్వామి కార్తీక మాస బ్రహ్మోత్సవాలు, జాతరను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేయాలని స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌తో కలసి వారు వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. నవంబర్ 24 నుంచి 29 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు దాదాపు 40 వేల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని, దానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఆలయం చుట్టూ కిలోమీటరు మేర నిరంతర పారిశుద్ధ్యం, మిషన్ భగీరథ ద్వారా శుద్ధ తాగునీరు, శాశ్వత మరుగుదొడ్లు, సీసీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్, పార్కు అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ బి అధికారులు జనగామ-జీడికల్ రహదారి పనులను 45 రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాల కోసం ప్రత్యేక కార్యాచరణ, మెడికల్ క్యాంపులు, లైటింగ్, డెకరేషన్, క్యూఆర్ కోడ్‌తో కూడిన రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. డీసీపీ రాజ మహేంద్ర నాయక్ మాట్లాడుతూ.. పటిష్టమైన పోలీసు బందోబస్తు, షీ టీమ్స్, క్రైమ్ టీమ్స్ మోహరింపుతో పాటు పార్కింగ్ ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. అనంతరం 30 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

**జాతర ప్రధాన తేదీలు:**

- **నవంబర్ 23: జాతర ప్రారంభం**
- **నవంబర్ 24: కార్తీక పౌర్ణమి**
- **నవంబర్ 27: ఎదురుకోళ్లు**
- **నవంబర్ 28: స్వామివారి కళ్యాణం**
- **నవంబర్ 29: రథోత్సవం**
- **డిసెంబర్ 05: జాతర ముగింపు**

ఈ సమావేశంలో జనగామ ఆర్డీఓ గోపీరాం, ఎంపీడీఓ శివశంకర్ రెడ్డి, తహసీల్దార్ ఆండాలు, ఆలయ కమిటీ ఛైర్మన్ మూర్తి, ఈఓ వంశీ, డీఎంహెచ్‌వో వాణిశ్రీ, ఎస్ఈ సంపత్ రెడ్డి, ఈఈ శ్రీకాంత్, ఈఈ రవీందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.




# wanted

## విలేకరులు కావలెను



మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 | 9676400812

# ఇంగ్లీష్ గ్రామర్‌పై పట్టుసాధించాలి

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడమే లక్ష్యం అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం, జిల్లాలోని లింగాల ఘనపురం మండలంలోని మోడల్ పాఠశాల & జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల, జూనియర్ కళాశాలలోని తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. మొదట ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ మొదటి, రెండో సంవత్సరం తరగతి గదులను సందర్శించి, పర్యవేక్షించారు. అలాగే 9వ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. అకాడమిక్ ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా ఇంగ్లీష్ గ్రామర్‌పై విద్యార్థులను ప్రశ్నించారు. ఇంగ్లీష్ గ్రామర్‌లోని ప్రాథమిక అంశాలను బోధించారు. అనంతరం 10వ తరగతిని సందర్శించి, ఫిజిక్స్ (భౌతిక శాస్త్రం) బోధన తీరును పరిశీలించారు. పాఠశాలలో అదనపు తరగతి గదుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయురాలికి సూచించారు. అదే విధంగా వంటశాలను పరిశీలించిన కలెక్టర్, కట్టెల పొయ్యిపై వంట చేయడాన్ని గమనించి, అసహనం వ్యక్తం చేశారు. గ్యాస్‌పై మాత్రమే వంట చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. పరిశీలనలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## జిల్లా స్థాయి చెస్ పోటీల్లో మెరిసిన రిశ్విక్

**జనగామ, మన చౌరాస్తా :** క్రీడలు విద్యార్థులలో ఆలోచనా శక్తిని, ఏకాగ్రతను మరియు నిర్ణయాత్మక సమర్థతను పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని, ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని సాయిరాం కన్వెన్షన్ హాల్‌లో 'గుడాల ఫ్యామిలీ ఫౌండేషన్' ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీల బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పోటీల్లో జనగామ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మేకల రిశ్విక్ యాదవ్ ప్రథమ బహుమతి సాధించి సైకిల్‌ను గెలుపొందాడు. విజేతగా నిలిచిన రిశ్విక్ యాదవ్‌ను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి స్వయంగా అభినందించి బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో గుడాల శ్రీనివాస్, వేణు, శ్రీధర్, ఫౌండేషన్ డైరెక్టర్ కాసాల సంతోష్‌కుమార్, స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, మేకల సమ్మయ్య, రాజ్‌కుమార్, రిత్విక్ కుమార్, వర్షిత్ కుమార్, మేకల ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డామరేశానందనాథ జయంతి



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో గల సాయిబాబా మందిరంలో డామరేశానందనాథ గురూజీ జయంతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సోమ, మంగళవారాల్లో నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా గురూజీ "పాదుకా ప్రతిష్ఠాపన" కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో ఏకాదశ రుద్రాభిషేకం, పల్లకి సేవ, నామ సంకీర్తన, పాదుకా పూజ తదితర ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మైత్రేయి కూచిపూడి నృత్య స్రవంతి గురూజీ పి. సుకేష్ మాస్టర్ ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ పూజారి పాలకుర్తి కోదండ రామశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ వేడుకలకు శిష్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దివంగత గురూజీ పాలకుర్తి లక్ష్మీనరసింహ స్వామి (డామరేశానందనాథ స్వామి) సాయిబాబా దేవాలయాన్ని స్థాపించి, అనేకమంది శిష్యులకు సన్మార్గాన్ని ఉపదేశించిన తీరును పలువురు భక్తులు ప్రసంగాల్లో స్మరించుకున్నారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి గురువుగారి ఆశీస్సులు పొందారు.

## 'ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనలో ప్రభుత్వాలు విఫలం'




**జనగామ, మన చౌరాస్తా :** యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, వాటి అసమర్థ విధానాల వల్ల రోజురోజుకూ నిరుద్యోగం పెరిగిపోతోందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ మండిపడ్డారు. జనగామ జిల్లా కేంద్రంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బానోత్ ధర్మభిక్షం అధ్యక్షతన నిర్వహించిన 2వ జిల్లా మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏళ్లు గడుస్తున్నా నిరుద్యోగులకు నిరాశే మిగిల్చిందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతూ, ప్రశ్నాపత్రాల లీకులతో యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర శాఖల్లో ఖాళీగా ఉన్న 10 లక్షల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తక్షణమే జాబ్ క్యాలెండర్ ప్రకటించి నోటిఫికేషన్లు ఇవ్వాలని, నెలకు ₹4,000 నిరుద్యోగ భృతి చెల్లించాలని కోరారు. రాజీవ్ యువ వికాస్ ద్వారా స్వయం ఉపాధి రుణాలు అందించాలని, గంజాయి, డ్రగ్స్ రవాణాను కట్టడి చేయాలని, జనగామలో పరిశ్రమలు నెలకొల్పి స్థానికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ నరేందర్, ఉపాధ్యక్షులు పి. కనకచారి, నీరటి సంపత్, ఎం. విప్లవరెడ్డి, శ్రీకాంత్, శ్రవణ్, కనకరాజు, సాయి, సురేష్, సంపత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## గోసంరక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టి

# జాతీయ గౌరవం కల్పించాలి

**జనగామ, మన చౌరాస్తా :** గోమాతకు జాతీయ గౌరవం కల్పిస్తూ, సంపూర్ణ సంరక్షణ కోసం కఠినమైన గోహత్య నిషేధ చట్టాలను తక్షణమే రూపొందించాలని ఆధ్యాత్మిక తత్వవేత్త డాక్టర్ మోహనకృష్ణ భార్గవ డిమాండ్ చేశారు. గోసంవర్ధన ప్రచార సమితి, గో సమ్మాన్ ఆహ్వాన్ అభియాన్ ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలోని శ్రీరాం నగర్, రేణుక నగర్, మూలబావి, గుండ్లగడ్డ, గిర్నిగడ్డ, ధర్మకంచ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమంలో ఒకే రోజు వెయ్యి మందికి పైగా పౌరులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా గోవుల అక్రమ రవాణా, వధలు నిరంతరం జరుగుతుండటం వల్ల గోసంతతి క్షీణించిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా, 'ఆపరేషన్ గోరక్ష' వంటి నిరసనలు చేపట్టి కలెక్టర్, పోలీసు యంత్రాంగానికి వినతిపత్రాలు ఇచ్చినా తగిన స్పందన రాలేదని వాపోయారు. జిల్లాలో గోవర్ధన నంది గోశాల, గో అవగాహన కేంద్రం ఏర్పాటు చేయాలని, రైతులకు ప్రోత్సాహకాలు అందించాలని మరియు విద్యావ్యవస్థలో 'గో విజ్ఞాన్'ను పాఠ్యాంశంగా చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో గో సంవర్ధన సమితి, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, మాతృశక్తి ప్రతినిధులు మరియు వినాయక ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

## పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి పనిచేయాలి



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** సంస్థాగత నిర్మాణం పటిష్టంగా ఉంటేనే ఏ రాజకీయ పార్టీ అయినా బలంగా ఉంటుందని, గ్రామీణ స్థాయి నాయకత్వమే పార్టీకి అసలైన బలమని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. స్టేషన్ ఘనపూర్ పట్టణంలోని ఎస్ కన్వెన్షన్‌లో నిర్వహించిన మండల, గ్రామ, అనుబంధ కమిటీల పరిచయ కార్యక్రమం మరియు మండల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, నూతన కార్యవర్గ సభ్యులకు కండువాలు కప్పి అభినందించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ.. కొత్త, పాత అనే భేదాలు లేకుండా ప్రతీ కార్యకర్త సమన్వయంతో, సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మళ్ళీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పార్టీలో ఉంటూ స్వంత నాయకులకు, పార్టీకి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే సహించేది లేదని, క్రమశిక్షణ తప్పితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉమ్మడి రాష్ట్రంలో నీటిపారుదల శాఖ మంత్రిగా తాను ప్రారంభించిన దేవాదుల ప్రాజెక్టు నేడు వేలాది ఎకరాలకు సాగునీరు అందిస్తూ రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతోందని, అది తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని గుర్తుచేశారు. నియోజకవర్గంలో ప్రతీ ఎకరానికి రెండు పంటలకు సాగునీరు అందించడమే తన ధ్యేయమని స్పష్టం చేశారు. ◌ంతకుముందు స్టేషన్ ఘనపూర్ మండలానికి చెందిన 24 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు ₹14,28,500 విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బెల్దే వెంకన్న, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# అన్నం మెతుకే అడ్డు తిరిగిందా?

- **అమ్మానాన్నల ఆశలు ఆవిరి.. బాలుడి మృతి**
- **నిన్నటి వరకు నవ్వులు.. నేడు కన్నీళ్లే**
- **తోటి విద్యార్థులు, ఉపాధ్యాయుల కంటతడి**

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ఆ చిన్నారి భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న అమ్మానాన్నలకు విధి తీరని విషాదాన్ని మిగిల్చింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు చదువుకుని ప్రయోజకుడై తమకు అండగా నిలుస్తాడని కలలు కన్న తల్లిదండ్రుల ఆశలు ఒక్కసారిగా ఆవిరయ్యాయి. సోమవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి చెందడంతో కొత్తపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బాలుడు ఎల్కతుర్తి పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాడు. సోమవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఇంట్లో నవ్వుతూ, ఆడుతూ తిరిగే చిన్నారి ఒక్కసారిగా విగతజీవిగా మారడంతో తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతంగా మారింది.



**అన్నం మెతుకే అడ్డు తిరిగిందా?**

బాలుడి మృతికి భోజనం చేస్తూ అన్నం మెతుకులు గొంతులో ఇరుక్కుపోవడమే కారణమా? లేక మరేదైనా కారణం ఉందా? అనే అనుమానాలు కుటుంబ సభ్యులు, గ్రామస్థుల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే బాలుడి మృతికి అసలు కారణం ఏమిటన్నది అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. ఈ విషాద ఘటనపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

**భవిష్యత్తుపై ఎన్నో కలలు**

చిన్ననాటి నుంచే కుమారుడిని అల్లారుముద్దుగా పెంచుకున్న తల్లిదండ్రులు అతడి భవిష్యత్తుపై ఎన్నో కలలు కన్నారు. బాగా చదివించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని, తమకు అండగా నిలిచేలా తీర్చిదిద్దాలని ఆశించారు. కానీ ఊహించని ఘటన వారి ఆశలను కన్నీళ్లుగా మార్చింది. తమ కళ్లముందే కుమారుడి మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రుల రోదనలు అక్కడున్న వారిని కలచి వేశాయి.

**నిన్నటి వరకు నవ్వులు.. నేడు కన్నీళ్లే**

బాలుడి మృతితో కుటుంబంలో ఒక్కసారిగా నిశ్శబ్దం నెలకొంది. నిన్నటి వరకు అతడి మాటలు, ఆటపాటలతో సందడిగా ఉన్న ఇల్లు.. నేడు కుటుంబ సభ్యుల రోదనలతో విషాదంగా మారింది. తమ బిడ్డ ఇక తిరిగి రాడనే వాస్తవాన్ని జీర్ణించుకోలేక తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి ఆవేదన చూసిన గ్రామస్థులు సైతం కంటతడి పెట్టారు.

**స్నేహితుల కంటతడి**

తమతో కలిసి చదువుకున్న స్నేహితుడు ఇక శాశ్వతంగా దూరమయ్యాడన్న విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. చివరిసారిగా తమ స్నేహితుడిని చూసేందుకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించారు. నిన్నటి వరకు తమతో కలిసి చదువుకున్న బాలుడు ఇక కనిపించడనే విషయాన్ని జీర్ణించుకోలేక పలువురు విద్యార్థులు కన్నీరుమున్నీరయ్యారు.



## గుండ్లగడ్డ కిష్టబావి శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో ఘనంగా అన్నప్రసాద వితరణ

**జనగామ, నమస్తే జనగామ :** జనగామ పట్టణంలోని గుండ్లగడ్డ కిష్టబావి శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయం వద్ద గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మెట్టు సురేష్‌వందన, దుబ్బాక బాలయ్యపద్మల సౌజన్యంతో ఈ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ గణనాథుని ఆశీస్సులు దాతల కుటుంబాలకు ఎల్లప్పుడూ ఉండాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి వైస్ చైర్మన్ భూష పర్వతాలు, కౌన్సిలర్లు సేవెల్లి మధు, సుగుణాకర్, ఉల్లెంగుల నర్సింహులు, తాటి కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కమిటీ గౌరవాధ్యక్షులు వద్నల లింగమూర్తి, అధ్యక్షుడు గట్టు రమేశ్, ఉపాధ్యక్షుడు చిదురాల బాబురావు, కోశాధికారి కోయల్ కార్ శేషు విరాట్ జీ, ప్రధాన కార్యదర్శి గుధినేని త్రయంబకేశ్, సహాయ కార్యదర్శులు ఆకుల నరేష్, గోగికర్ శివాజి, కొత్తపల్లి సత్తయ్య, ఆర్గనైజర్ చెల్లోజు నవీన్ చారి పాల్గొన్నారు. అలాగే ముఖ్య సలహాదారులు ఎర్రమళ్ళ సుధాకర్, దుబాయ్ శ్రీనువాస్, గట్టు దామోదర్, మిర్యాల రమేష్, ఆకుల శ్రీనివాస్, ఎనగందుల సుధాకర్, మిలిటరీ ప్రవీణ్, రోకాటి మురళి, గట్టు కిరణ్, కార్యవర్గ సభ్యులు కట్కూరి శ్రీను, మామిడాల శంకర్, బాలదే యోగేష్, కట్కూరి మహేష్, సిరిమల్లె అనిల్, బొల్లం నరేష్, నార్ల సాయి, బొల్లం కార్తీక్, సాయబోయిన సాయి, రమేష్, నీలం రవితేజ, శ్రీనాథ్ పాల్గొన్నారు.



## ఎంజీఎం దుస్థితిపై ప్రశ్నిస్తే దాడులు చేస్తారా?

- **వినయ్ భాస్కర్‌పై పోలీసుల దౌర్జన్యంపై పల్లా ఆగ్రహం**
- **పోలీసుల దాడిని తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే పల్లా**

**జనగామ, మన చౌరాస్తా :** వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి దుస్థితిని ప్రశ్నిస్తూ సందర్శనకు వెళ్లిన మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌పై పోలీసులు వ్యవహరించిన తీరును జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఎంజీఎంలో బెడ్లు, అంబులెన్స్‌ల కొరత, పైకప్పులు పెచ్చులూడుతున్న దుస్థితిపై ప్రశ్నించిన ప్రజాప్రతినిధిని అడ్డుకుని దాడి చేయడం దారుణమన్నారు. ప్రజా సమస్యలను ప్రశ్నించినందుకు కడుపులో తన్నడం, గాయపర్చడం ఏ విధమైన ప్రజాస్వామ్య పాలన? అని ప్రశ్నించారు. ఆసుపత్రుల పరిస్థితులను చక్కదిద్దాల్సిన ప్రభుత్వం..ప్రశ్నించే వారిపై పోలీసులతో దాడులు చేయించడం సిగ్గు చేటన్నారు. పోలీసుల అత్యుత్సాహాన్ని వెంటనే అరికట్టి, వినయ్ భాస్కర్‌పై జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం ప్రజాప్రతినిధుల బాధ్యత..ఆ గొంతును పోలీసు బలంతో అణచి వేయడం ఎవరి వల్లా సాధ్యం కాదని పల్లా రాజేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

## వీబీ జీఆర్‌ఏఎంజీ పనులను వేగవంతం చేయాలి

**ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

జనగామ, మన చౌరాస్తా : వీబీ జీఆర్‌ఏఎంజీ పథకం కింద మంజూరైన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి, విద్యుత్, మిషన్ భగీరథ, వ్యవసాయ శాఖల అధికారులతో కలసి వారు సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. వర్షపాతం తక్కువగా ఉన్నందున రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని, వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. నియోజకవర్గంలో మంజూరైన 8 సబ్ స్టేషన్లలో మిగిలిన ఐదింటి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. మహిళా సమాఖ్య (VO) భవనాల నిర్మాణాలు నిర్దేశిత వ్యవధిలోగా పూర్తి చేయాలని, ప్రాజెక్టుల భూసేకరణ, కాలువల శుభ్రత పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. పాఠశాలల ప్రహరీ గోడలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఘనపూర్ ఆర్డీఓ కిరణ్ ప్రకాష్, డీఆర్డీఓ భాస్కర్, డీఏఓ అంబికా సోనీ, నీటిపారుదల శాఖ ఎస్ఈ సీతారాం, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ శ్రీకాంత్ తదితర అధికారులు పాల్గొన్నారు.





## పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో మహా గణపతి హోమం

**పాలకుర్తి, మన చౌరాస్తా :** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పాలకుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహా గణపతి హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి, రాజరామ్మోహన్ రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని, పాలకుర్తి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. హోమ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో ఝాన్సీ రాజేందర్ రెడ్డి స్వయంగా భక్తులకు ప్రసాదాన్ని వడ్డించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా, యువజన విభాగాలు, కార్యకర్తలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు.



# పింఛన్ కోసం ఎదురుచూపులు

- రేపటి జీవితం ఎలా?
- చాలీచాలని జీతంతో అంగన్వాడీ కేంద్రంలో సేవలు
- రిటైర్మెంట్‌కు ఏడాది.. ఆ తర్వాత ఆధారం ఏమిటో తెలియని పరిస్థితి
- వితంతు లేదా వృద్ధాప్య పింఛన్ ఇవ్వాలని అధికారులకు వేడుకోలు



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** చిన్న వేతనంతో ఏళ్ల తరబడి అంగన్వాడీ కేంద్రంలో సేవలందిస్తున్న ఆమెకు ఇప్పుడు రిటైర్మెంట్ సమీపిస్తోంది. జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ కుటుంబాన్ని నెట్టుకొచ్చిన ఆమెకు.. పదవీ విరమణ తర్వాత వచ్చే రోజులు ఎలా ఉంటాయోనన్న ఆందోళన వెంటాడుతోంది. ప్రభుత్వం నుంచి తమ శాఖ ద్వారా పదవీ విరమణ అనంతరం ఎలాంటి పింఛన్ సౌకర్యం లేదని, కనీసం వృద్ధాప్య లేదా వితంతు పింఛన్ అయినా అందితే తనకు ఆసరాగా ఉంటుందని అధికారులను వేడుకుంటోంది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామానికి చెందిన గోపగాని కనుకమ్మ స్థానిక అంగన్వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తోంది. చాలీచాలని జీతంతో కుటుంబ అవసరాలను తీర్చుకుంటూ ఇన్నాళ్లు విధులు నిర్వహించింది. ప్రస్తుతం ఆమె పదవీ విరమణకు మరో ఏడాది మాత్రమే గడువు ఉంది. వయసు పెరుగుతున్న కొద్దీ శారీరక శ్రమతో కూడిన పని చేయడం కూడా కష్టంగా మారుతున్నా, తన బాధ్యతలను నిర్వర్తిస్తూ వస్తోంది. ఇటీవలే ఆమె వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంది. అయితే అంగన్వాడీ కేంద్రంలో పనిచేస్తున్న కారణంగా ప్రభుత్వ పింఛన్ నిబంధనల పరిధిలో తాను అర్హురాలవుతానో లేదో అనే ఆందోళన వ్యక్తం చేస్తోంది. తమ శాఖలో పనిచేసే వారికి పదవీ విరమణ తర్వాత ప్రత్యేక పింఛన్ సౌకర్యం లేకపోవడంతో.. భవిష్యత్తులో తన జీవనాధారం ఏమిటన్న ప్రశ్న ఆమెను వేధిస్తోంది.

**నిబంధనలు శాపంగా మారొద్దు..**

ప్రభుత్వ పింఛన్ పథకాలలోని నిబంధనలు తమలాంటి పేద, నిరుపేద మహిళలకు శాపంగా మారకూడదని కనుకమ్మ ఆవేదన వ్యక్తం చేస్తోంది. తాను ఉద్యోగ విరమణ తర్వాత పెద్ద మొత్తంలో ఆర్థిక ప్రయోజనాలు కోరుకోవడం లేదని, కనీసం వృద్ధాప్యంలో జీవనం సాగించేందుకు ప్రభుత్వం నుంచి నెలనెలా పింఛన్ అందించాలని కోరుతోంది. చాలీచాలని వేతనంతో ఇన్నాళ్లు అంగన్వాడీ కేంద్రంలో పనిచేసిన తనలాంటి వారికి పదవీ విరమణ అనంతరం ఎలాంటి ఆదాయ వనరు ఉండదని తెలిపింది. భర్తను కోల్పోయిన తనకు ప్రభుత్వం అందించే పింఛన్ ఎంతో భరోసానిస్తుందని పేర్కొంది.

**మానవతా దృక్పథంతో ఆదుకోవాలి**

ప్రభుత్వ నిబంధనలు, అర్హతల విషయంలో అధికారులు తన పరిస్థితిని మానవతా దృక్పథంతో పరిశీలించాలని కనుకమ్మ విజ్ఞప్తి చేస్తోంది. తనకు వితంతు పింఛన్ లేదా అర్హతను బట్టి వృద్ధాప్య పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతోంది. "ఇన్నాళ్లు కష్టపడి పనిచేశాను. రిటైర్మెంట్ తర్వాత నా పరిస్థితి ఏమిటో భయంగా ఉంది. మా శాఖ నుంచి పదవీ విరమణ తర్వాత పింఛన్ రాదు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో నా పరిస్థితిని పరిశీలించి కనీసం వితంతు లేదా వృద్ధాప్య పింఛన్ అందించాలి" అని కనుకమ్మ వేడుకుంటోంది. రిటైర్మెంట్‌కు మరో ఏడాది మాత్రమే ఉన్న నేపథ్యంలో అధికారులు తన దరఖాస్తును పరిశీలించి న్యాయం చేయాలని ఆమె కోరుతోంది.

## మల్లికార్జునస్వామి ఆలయంలో మహా అన్నదానం



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** గణపతి నవరాత్రులలో భాగంగా ముల్కనూర్ శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 550 మంది భక్తులు అన్నదాన తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముల్కనూర్ ఎస్సై రాజు హాజరై వినాయక పూజ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్ జక్కుల మల్లికార్జున్, ఉపాధ్యక్షుడు గిరబోయిన కుమారస్వామి, మాజీ చైర్మన్ జక్కుల ప్రకాశం, యాదవ సంఘం కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మామునూరు విమానాశ్రయానికి అంబేద్కర్ పేరు పెట్టాలి

- తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** మామునూరులో నిర్మించనున్న విమానాశ్రయానికి భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. విమానాశ్రయానికి ''భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విమానాశ్రయం''గా నామకరణం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణకు రాజ్యాంగపరమైన మార్గాన్ని కల్పించడంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దూరదృష్టి స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుతో పరిపాలన ప్రజలకు చేరువ కావడంతో పాటు అభివృద్ధి అవకాశాలు మెరుగుపడతాయని అంబేద్కర్ అభిప్రాయపడ్డారని తెలిపారు. చారిత్రకంగా వరంగల్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని, కాకతీయుల కాలంలో వరంగల్ రాజధానిగా వెలుగొందిందని ప్రకాష్ పేర్కొన్నారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతం తెలంగాణలో కీలక నగర సముదాయంగా అభివృద్ధి చెందుతోందని, భవిష్యత్తులో ఈ ప్రాంతం మరింత ప్రాధాన్యత సంతరించుకునే అవకాశం ఉందన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించడంతో పాటు విద్య, సామాజిక న్యాయం, మహిళల హక్కులు, కార్మికుల హక్కులు, ప్రజాస్వామ్యం, సమానత్వం కోసం జీవితాంతం కృషి చేశారని తెలిపారు. ఆయన ఆలోచనలు నేటికీ ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొందూరి ఎల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి కండే సుధాకర్, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాక రమేష్, వేముల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.





## పంపు డ్రైవర్‌పై దాడి..

**పోలీసులకు ఫిర్యాదు**

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రాంనగర్ గ్రామపంచాయతీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పంపు డ్రైవర్ ఎమునూరి వీరయ్యపై అదే గ్రామానికి చెందిన భూక్య రాజేందర్ అకారణంగా దాడి చేసినట్లు ఆరోపిస్తూ మంగళవారం వంగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. విధుల్లో ఉన్న సమయంలో తనపై దాడి చేసినట్లు వీరయ్య ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఉమ్మడి జిల్లా ఎస్సీ, ఎస్టీ గ్రామపంచాయతీ కారోబార్ల సంఘం అధ్యక్షుడు బోనగిరి పోచయ్య వీరయ్యను పరామర్శించారు. విధి నిర్వహణలో ఉన్న గ్రామపంచాయతీ సిబ్బందిపై దాడులకు పాల్పడటం సరికాదని ఆయన అన్నారు. సిబ్బందిపై దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## 2న నల్ల నర్సింహులు శత జయంతి ఉత్సవాలు

- మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నరసింగరావు

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు నల్లా నర్సింహులు శత జయంతి ఉత్సవాలను అక్టోబర్ 2న జనగామ పట్టణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు 'మన ఆలోచన సాధన సమితి' వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నరసింగరావు తెలిపారు. మంగళవారం జనగామలో ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన నేతృత్వంలో నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగం, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం నల్లా నర్సింహులు సాగించిన పోరాటం, త్యాగాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అక్టోబర్ 2న ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ శత జయంతి ఉత్సవాల్లో ప్రజలు, ఉద్యమకారులు, మేధావులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నల్లా నర్సింహులు కుమార్తె అరుణక్క, బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షుడు బొంగు ప్రసాద్ గౌడ్, తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు కల్నల్ డాక్టర్ బిక్షపతి, బీఆర్ఎస్ కౌన్సిలర్ ఎలగందుల కృష్ణ, కన్న పరశురాం గౌడ్, చంద్రశేఖర్, రవి, రమేష్, బహుజన టీచర్స్ వీర నరసయ్య, పిట్టల సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆయుర్వేద వెల్‌నెస్, యోగా వాక్




**జనగామ, మన చౌరాస్తా :** ఆయుర్వేదం, యోగా, ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం కావాలని డీసీపీ రాజ మహేంద్ర నాయక్ అన్నారు. 11వ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లాకేంద్రంలోని నెహ్రూ పార్క్ వద్ద నిర్వహించిన 'ఆయుర్వేద వెల్‌నెస్ & యోగా వాక్'ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ నెహ్రూ పార్క్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు సాగింది. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ఆయుర్వేదం భారతీయ సనాతన వైద్య విధానమని, రోగనిరోధకతను పెంచేందుకు ప్రకృతి ఆధారిత జీవనశైలి ఎంతో కీలకమని పేర్కొన్నారు. అనంతరం డీఎంహెచ్ఓ మాట్లాడుతూ నిత్య వ్యాయామం, యోగా, ఆయుర్వేద పద్ధతుల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ వాణిశ్రీ, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ మమత, డాక్టర్ సరిత, డీపీఎం కుమార్, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు మరియు ఆయుష్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**